క్లుప్తంగా

బాల కళాకారులకు గౌరవ పురస్కారాలు ప్రదానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అవరణలోని శ్రీపద్మావతి కళావేదికపై బుధవారం భరతమాత పూజా దినోత్సవాలు ముగిశాయి. సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు భాష్యం విద్యా సంస్థలు అధినేత భాష్యం రామకృష్ణ, ఆర్‌వీఆర్ కళాశాల ఆచార్యులు టి.కోటేశ్వరరావు, భారత్ వికాస్ పరిషత్ బ్రహ్మం బహుమతులు అందించారు. అనంతరం చిన్నారుల దేశభక్తుల వేషధారణలు అలరించగా, బాల కళాకారులకు గౌరవ పురస్కార ప్రదానం చేశారు. అనంతరం అన్నమయ్య కళావేదికపై విద్యార్థులు కూచిపూడి, జానపద నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైద్యులు శేషయ్య, పాలకమండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

న్యాయవాది ప్రకాశరావుపై చర్యలు తీసుకోవాలి

డీఆర్వోకు వినతి పత్రం

గుంటూరు వెస్ట్: గత నెలలో పొన్నూరులో చోటుచేసుకున్న ఘటనలో ప్రజలను, అధికారులను తప్పుదోవ పట్టిస్తున్న న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని నవ్యాంధ్ర గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తిన లక్ష్మణశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మణశేఖర్ మాట్లాడుతూ గతనెల క్రిస్మస్ పండుగ సందర్భంలో ఏర్పడిన వివాదం నేపథ్యంలో ఆస్పత్రిలో జరిగిన ఘటనలో న్యాయవాది అనవసరంగా కలుగ చేసుకోవడమే కాకుండా, వైద్యులు, పోలీసులను దుర్భాషలాడారన్నారు. అతడిపై తక్షణమే విచారించి చర్యలు చేపట్టాలని విన్నవించారు.

25న రైతుల నిరసన

లక్ష్మీపురం: రైతు జగత్ సింగ్ దలేవాల్‌కు మద్దతుగా ఈనెల 25న నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి.ప్రసాద్ తెలిపారు. గుంటూరు రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25న గుంటూరు నగరంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 26న అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.విశల్ రెడ్డి, ఏరువాక రైతు సంఘం నాయకులు రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈమని అప్పారావు, ముత్యాలరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా కె.ఎస్.లక్ష్మణరావును మళ్లీ గెలిపించాలి

లక్ష్మీపురం: కార్మికుల సమస్యల పరిష్కారానికి జరిగే పోరాటాలకు నిత్యం అండగా నిలుస్తున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావును మళ్లీ గెలిపించుకోవాలని గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్ల సమావేశంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావును గెలుపించుకుందాం పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మార్చిలో జరగబోయే శాసనమండలి ఎన్నికల్లో ఆటో డ్రైవర్లలోని పట్టభద్రులు, వారి కుటుంబాలలోని పట్టభద్రులు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, నాయకులు గంగాధర్, శ్రీనివాసరావు, సుభాష్, శంకర్, రఘు పాల్గొన్నారు.

క్రీడాకారుల వ్యక్తిగత అభివృద్ధికి అథ్లెటిక్స్ దోహదం

ఏఎన్‌యూ: క్రీడాకారుల వ్యక్తిగత అభివృద్ధికి అథ్లెటిక్స్ దోహదపడతాయని యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి అన్నారు. వర్సిటీలోని వ్యాయామ విద్య కళాశాల ఆధ్వర్యంలో బుధవారం లేటెస్ట్ ట్రెండ్స్ ఇన్ అథ్లెటిక్స్ అఫీషియేటింగ్ అనే అంశంపై యూజీసీ సహకారంతో రెండు రోజుల జాతీయ వర్క్ షాప్ ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆచార్య రత్న షీలామణి మాట్లాడారు.

సర్జరీ సేవలకు వందనం

- గత టీడీపీ ప్రభుత్వంలో ఆగిన గుండె ఆపరేషన్లు
- డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే ఆధ్వర్యంలో సర్జరీలు
- 'సాక్షి' కథనంతో బైపాస్ సర్జరీలు ప్రారంభం

విజయవంతంగా వంద గుండె బైపాస్ సర్జరీలు



డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే(ఫైల్)

గుంటూరు మెడికల్: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పేదల పెద్దాస్పత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్ అరుదైన ఘనతను నమోదు చేసుకుంది. వంద గుండె బైపాస్ సర్జరీలు విజయవంతంగా పూర్తిచేసింది. రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఖరీదు చేసే ఈ ఆపరేషన్లను సహృదయ ట్రస్టు సహకారంతో ఉచితంగా నిర్వహించింది. జీజీహెచ్ సీటీవీఎస్ వైద్యులు అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు.

సాక్షి కథనంతో...

గుంటూరు జీజీహెచ్ గుండె శస్త్రచికిత్స విభాగం(సీటీఎస్)లో సుమారు రూ.10 కోట్ల ఖరీదు చేసే వైద్య పరికరాలు వృథాగా ఉండిపోవటం, బైపాస్ సర్జరీలు జరగకపోవటంపై 'సాక్షి'లో 2022 మార్చి 15న 'హృదయ' వేదన అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. జీజీహెచ్‌లో గుండె బైపాస్ సర్జరీల నిలిపివేత వల్ల



ఆపరేషన్ చేయించుకున్న వారితో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుండె ఆపరేషన్ చేసిన వైద్య బృందం(ఫైల్)

పేద గుండెజబ్బు రోగులు పడుతున్న ఇబ్బందులను అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె జీజీహెచ్‌లో గుండె ఆపరేషన్లు చేసేందుకు గతంలో జీజీహెచ్‌లో గుండె ఆపరేషన్లు చేసిన సహృదయ ట్రస్ట్ నిర్వాహకులు, గుండె మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే బృందాన్ని ఆహ్వానించారు. జీజీహెచ్ సీటీవీఎస్ వైద్యులు బైపాస్ సర్జరీలు చేసేందుకు డాక్టర్ గోఖలే బృందానికి తగిన సహకారం అందిచటం లేదనే విషయాన్ని డాక్టర్ గోఖలే ఉన్నతాధికారులకు లేఖ రూపంలో తెలియజేశారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తక్షణమే గుండె బైపాస్ సర్జరీలకు అడ్డంకులు చెబుతున్న వైద్యురాలికి బదిలీ వేటు వేసి డాక్టర్ గోఖలే సర్జరీలు చేసేందుకు లైన్ క్లియర్ చేశారు.

2023 జూన్ 26న బైపాస్ సర్జరీలు..

గుంటూరు ఏటీ అగ్రహారానికి చెందిన 50 ఏళ్ల కొరివి కిషోర్‌కు 2023 జూన్ 26న గుంటూరు జీజీహెచ్ సీటీవీఎస్ వైద్య విభాగంలో గుండె బైపాస్ సర్జరీ చేశారు. డాక్టర్ గోఖలే జీజీహెచ్ వైద్యులకు శిక్షణ ఇచ్చి వారే స్వయంగా ఆపరేషన్లు చేసేలా అండగా నిలవటంతో నాటి నుంచి నేటి వరకు జీజీహెచ్ గుండె శస్త్రచికిత్స విభాగం వైద్యులు విజయవంతంగా వంద గుండె బైపాస్ సర్జరీలు చేశారు. నాటి నుంచి గుండె శస్త్రచికిత్స వైద్య విభాగంలో పనిచేస్తున్న వైద్యులు వైద్య విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణమూర్తి ఆధ్వర్యంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరం కుప్పుస్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ యోగి, డాక్టర్ ప్రమోదలు సేవలందించారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా

పేద ప్రజలకు రూ.5 లక్షల ఖరీదు చేసే గుండె బైపాస్ సర్జరీలు ఉచితంగా చేస్తున్నాం. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రులకంటే దీటుగా ఉచితంగా గుండె ఆపరేషన్లు చేస్తున్నాం. డాక్టర్ పాదిల ప్రసాద్ సూపర్ స్పెషాలిటీ మిలీనియం బ్లాక్‌లో మాడ్యూలర్ ఆపరేషన్ థియేటర్లు, కార్పొరేట్‌కు మించి వైద్య సౌకర్యాలు ఉన్నాయి. జీజీహెచ్‌లో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ యశస్వి రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్

గుండె రోగులకు మెరుగైన సేవలు

సిటీవీఎస్, ఎనస్థీషియా వైద్యులతోపాటు, ఇతర వైద్య సిబ్బంది అంతా కలిసికట్టుగా పనిచేయడం వల్ల సక్సెస్ ఫుల్‌గా వంద గుండె బైపాస్ ఆపరేషన్లు చేశాం. అవుట్‌పేషెంట్ విభాగంలో ప్రతి సోమ, శుక్రవారాల్లో ఉదయం 9 నుంచి 4 గంటల వరకు సిటీవీఎస్ వైద్యుడు అందుబాటులోఉండి గుండె జబ్బుల రోగులకు సేవలు అందిస్తున్నాం. ఇన్‌పేషెంట్ విభాగంలో 257 నంబరులో అత్యవసర కేసులకు 24 గంటలూ సేవలు అందుబాటులో ఉన్నాయి. కీ హోల్ సర్జరీలు అందుబాటులోకి తెస్తున్నాం.

– డాక్టర్ హరికృష్ణమూర్తి, గుండె శస్త్రచికిత్స వైద్య విభాగాధిపతి (సీటీవీఎస్)

నేడు కార్మికుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల సమస్యల పరిష్కారానికి గురువారం ప్రత్యేక గ్రీవెన్ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో పని చేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో కార్మికులు ప్రధానంగా పీఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై ఎదురవుతున్న సమస్యలపై అర్జీలను గ్రీవెన్స్‌లో అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

నగరంపాలెం: నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ముగ్గురిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగదు అప్పుగా తీసుకుని చెల్లించని ఏఆర్ హెడ్ కానిస్టేబుల్(హెచ్‌సీ), ఏఆర్ కానిస్టేబుల్, హోంగార్డులపై వేటు వేశారు. పోలీస్ అధికార, సిబ్బంది ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక పరమైన లావాదేవీల్లోనూ, మధ్యవర్తిత్వం వహించినా శాఖాపరమైన చర్యలు ఉంటాయని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టాలి

లక్ష్మీపురం: జీజీహెచ్‌కు వెల్ఫేర్ సెంటర్‌లో కేటాయించిన ఆరు ఎకరాల స్థలంలో హాస్పిటల్ నిర్మాణం వెంటనే చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి కోరారు. కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. హాస్పిటల్ అభివృద్ధిని పార్టీ తరుపున స్వాగతిస్తున్నట్లు చెప్పారు. స్థలం చుట్టు వాల్ నిర్మాణానికి టెండర్లు పిలవడం అయిందని దీనివల్ల సమస్య పెరుగుతుంది తప్ప స్థానిక ప్రజల ఆకాంక్ష నెరవేరదని, వెంటనే హాస్పిటల్ నిర్మాణం చేపట్టి, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కమిషనర్ దోచేసిన సొమ్మును కక్కిస్తాం

- ఐఏఎస్ హోదాలో కమిషనర్ అబద్ధాలు ఆడటం సిగ్గుచేటు
- వరదల పేరుతో రూ.9.24 కోట్లలో కమిషనర్ 75 శాతం దోచేశారు
- అవినీతి చేయలేదని అనుకుంటే లెక్కలు చూపించాలి
- విలేకర్ల సమావేశంలో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు



నెహ్రూనగర్: బుడమేరు వరద సహాయ చర్యల్లో కమిషనర్ దోచేసిన సొమ్మును కక్కిస్తామని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. బుడమేరు వరదల్లో ఖర్చు పెట్టిన లెక్కల వివరాలను మేయర్ చాంబర్‌కు ఫైల్ సర్కులేట్ చేశారని ఐఏఎస్ హోదాలో కమిషనర్ అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని నగర మేయర్ పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ మేయర్ చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ అవినీతి బయటపడుతుందో అని కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుండా కమిషనర్ తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. కౌన్సిల్ నిర్వహించాలని లేఖలు రాసినప్పటికీ కమిషనర్ నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదని చెప్పారు. 10 లక్షల జనాభా కలిగి ఉన్న గుంటూరు నగర ప్రజలకు ప్రతినిధిగా ఉన్నటువంటి మేయర్ చెప్పిన కూడా కౌన్సిల్ ఏర్పాటు చేయడం లేదంటే కమిషనర్ బుడమేరు వరదల పేరుతో ఖర్చు చేసిన రూ.9.24 కోట్లలో 75శాతం దోచేసి తమ వారి ఖాతాలకు మళ్లించారని ఆరోపించారు.

వరద బాధితులకు అండగా ఉండాల్సిందే..

విజయవాడలో బుడమేరు వరదల కారణంగా రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు నగరపాలక సంస్థ తరఫున సాయం అందించాలని ఆదేశించినప్పుడు మేయర్‌గా ఆనాడే కమిషనర్‌కు అండగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందని చెప్పానని మీడియా సమావేశంలో పేర్కొన్నారు. కాని ఆ తరువాత నిధులు ఖర్చు పెట్టే విషయంలో కౌన్సిల్‌కు, స్టాండింగ్, మేయర్‌కు కాని ఎటువంటి సమాచారం లేకుండానే రూ.9.24 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. భవిష్యత్‌లో న్యాయస్థానాలను ఆశ్రయించి కమిషనర్ దోచేసిన సొమ్మును కక్కిస్తామని ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు.

ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ

అవినీతి సొమ్ము ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చునని వెల్లడించారు. గుంటూరు నగరం నుంచి 17.50 లక్షల ఆహార పొట్లాలు ఎక్కడ తయారు చేశారు. ఇతర వివరాలతో నగర మేయర్ అయిన నాకు ఫైల్ సర్కులేట్ చేశానని కమిషనర్ అబద్ధాలు చెబుతున్నారన్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి 2 గంటల వరకు నగరపాలక సంస్థ కార్యాలయంలోనే మేయర్ చాంబర్‌లోనే అందుబాటులో ఉంటానని కమిషనర్ తన నిజాయితీ నిరుపించుకోవాలని సవాల్ విసిరారు.

బౌద్ధంతో విజ్ఞాన శాస్త్రం అనుసంధానం

ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు



సదస్సులో మాట్లాడుతున్న వీసీ

ఏఎన్‌యూ: బౌద్ధం ఒక జీవన విధానమని తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కె.గంగాధర రావు అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలోని బౌద్ధ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'బుద్ధిజం సైన్స్ అండ్ టెక్నాలజీ– ఛాలెంజెస్ ఇన్ ద ఏజ్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై యూజీసీ, ఐసీపీఆర్ సహకారంతో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. సదస్సుకు ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎల్.ఉదయ్ కుమార్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. సదస్సు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ నాటి బౌద్ధం ద్వారా విజ్ఞానం ఎలా పెంపొందిందో వివరిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆధునిక టెక్నాలజీగా పేరుపొందిన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రాధాన్యాన్ని వివరించారు. సదస్సుకు అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీ యూసీసీఎస్ సెంటర్ ఆర్కియాలజీ కో–డైరెక్టర్ ప్రొఫెసర్ ఫ్రెడరిక్ ఎల్. కూలిడ్జ్ ముఖ్య వక్తగా పాల్గొని కీలక ఉపన్యాసం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జీవితం, నిష్క్రమణ మూలాలను బౌద్ధంలోని సుఖదుఃఖాల భావనలను అనుసంధానం చేసి వివరించారు. బౌద్ధాన్ని ఒక మతంగా కాకుండా జీవన విధానంగా భావించినప్పుడే అందులోని జ్ఞానం అందిపుచ్చుకోగలమని పేర్కొన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎల్.ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రెండు రోజుల ఈ జాతీయ సదస్సుకు ఐఐటీ, సెంట్రల్ యూనివర్సిటీ, స్టేట్ యూనివర్సిటీల నుంచి 30 మంది పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారని పేర్కొన్నారు. అందులో తొలి రోజు 15 మంది వారి పరిశోధన పత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. సదస్సులో పూణే యూనివర్సిటీ నుంచి పాల్గొన్న ప్రొఫెసర్ ప్రదీప్ గోకాలే, అలహాబాద్ యూనివర్సిటీ నుంచి పాల్గొన్న డాక్టర్ భీమకుమార్, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి పాల్గొన్న ప్రొఫెసర్ డి.బాలగణపతి, మద్రాస్ ఐఐటీ నుంచి పాల్గొన్న ప్రొఫెసర్ సత్య సుందర్ శెట్టి తమ సందేశాలను అందించారు. జేఎన్‌యూ నుంచి పాల్గొన్న ఆచార్య స్మిత సర్కార్, ఏఎన్‌యూ బుద్ధిజం విభాగం పూర్వ విభాగాధిపతి ఆచార్య ఎం.వి.రాంకుమార్ రత్నం, వియత్నాంకి చెందిన పరిశోధకురాలు అన్వీ తదితరులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. సదస్సుకు ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి అధ్యక్షత వహించారు. సదస్సులో విభాగం అధ్యాపకులు ఆచార్య జె.సీతారావమ్మ, డాక్టర్ వి.దిలీప్ కుమార్, డాక్టర్ ఆర్.శేషగిరిరావు పాల్గొన్నారు.

బహిరంగంగా మద్యం తాగిన ముగ్గురిపై కేసు

లక్ష్మీపురం: గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్ గేటు వద్ద ముగ్గురు వ్యక్తులు బహిరంగ మద్యం తాగిన స్థానికులను, వాహనదారులకు ఆటంకం కలిగించిన వారిపై పట్టాభిపురం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. పట్టాభిపురం పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ స్వర్ణసింగ్, కానిస్టేబుల్ శివ నాగరాజు గుజ్జనగుండ్ల ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ చేస్తున్నారు. అదే సమయంలో వాకింగ్ ట్రాక్ గేటు వద్ద ముగ్గురు వ్యక్తులు మోర్తిబాబు, శ్రీనివాసరావు, రవికుమార్ అనే వారు బహిరంగంగా మద్యం తాగి అటుగా ప్రయాణించే వాహనదారులను, స్థానికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తు ఆటంకం కలిగిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలంలో ఉన్న ముగ్గురిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళను బెదిరించిన వ్యక్తిపై..

లక్ష్మీపురం: ఓ మహిళను నిత్యం వేధిస్తూ నిలదీసిన తల్లిపై దాడి చేసి గాయపరిచడంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. నిరుపేదల కాలనీకి చెందిన బొందలపాటి చిన్ని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటుంది. అదే ప్రాంతానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి కూలీ పనులు చేసుకుంటూ ఉంటాడు. మహిళను బెదిరిస్తుండడంతో తల్లి, రాజేష్‌ను నిలదీసింది. దీంతో రాజేష్ కుటుంబ సభ్యులు బాధితురాలి తల్లిపై కర్రలతో దాడి చేశారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెదల మందు తాగి మహిళ మృతి

లక్ష్మీపురం: మానసిక వైకల్యంతో బాధపడుతున్న మహిళ చెదల మందు తాగి ఆత్మహత్య చేసుకుని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. భారతపేట 8వ లైన్ ప్రాంతానికి చెందిన యాలమందల రాజేశ్వరి(53) గత కొంత కాలంగా మానసికంగా అనారోగ్యంతో విజయవాడలోని ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయితే మంగళవారం సాయంత్రం చెదల మందు తాగి వాంతులు చేసుకుంది. దీన్ని గమనించిన కుమార్తె సకల బత్తుల సుకన్య జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలంలో వివరాలు సేకరించి మృతురాలి కుమార్తె సుకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

లక్ష్మీపురం: మహిళ అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బ్రాడీపేట 6/20వ అడ్డ రోడ్డు ప్రాంతానికి చెందిన బొందిల గంగారామ్ సింగ్ కుమార్తె గౌతమి 5వ లైన్‌లో ఓ షాపులో పని చేస్తోంది. ఈనెల 18వ తేదీన షాపునకు వెళ్లి తిరిగి రాలేదు.

మరుసటి రోజు తండ్రి గంగారామ్ వెళ్లి విచారించగా 18వ తేదిన షాపు తియ్యలేదని యజమాని బదులు ఇచ్చాడు. దీంతో చుట్టు పక్కల బంధు మిత్రుల వద్ద విచారించగా ఎలాంటి సమాచారం తెలియలేదు. దీంతో పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో గంగారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు



వెస్ట్ గోదావరి వారియర్స్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున భాష్యం రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: పోటీతత్వాన్ని పెంచుకుని జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకష్ణ అన్నారు. బుధవారం గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జేఎస్‌ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ – బీపీఎల్ 2024–25లో భాగంగా జరుగుతున్న క్రికెట్ పోటీలు మూడో రోజు హోరాహోరీగా సాగాయి. ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్‌లో హైదరాబాద్ హరికేన్స్–1 జట్టుపై గుంటూరు గ్లాడియేటర్స్–1 జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం క్వార్టర్స్ ఫైనల్స్ మ్యాచ్‌లో వెస్ట్ గోదావరి వారియర్స్, గుంటూరు గార్డియన్స్–2 జట్లు తలపడగా వెస్ట్ గోదావరి వారియర్స్ జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు చైర్మన్ భాష్యం రామకష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సావిత్రీబాయి పూలే అవార్డులు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సుశీల



పద్మలతను అభినందిస్తున్న లలిత్‌కుమార్ జైన్

గుంటూరు ఎడ్యుకేషన్: సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ (ఎస్పీఎల్‌టీఏ) ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులో నిర్వహించిన సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఏటీ అగ్రహారంలోని జీకేఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ జి.సుశీల అవార్డు అందుకున్నట్లు పాఠశాల డైరెక్టర్ జి. జనార్దన్‌రెడ్డి బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఎస్పీఎల్‌టీఏ నిర్వాహకులతో పాటు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సమక్షంలో ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన జీకేఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ జి.సుశీలతో పాటు పాఠశాల డైరెక్టర్ జి.జనార్ధరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పట్టాభిపురం క్యాంపస్ డైరెక్టర్ జి. కొండారెడ్డి, ప్రిన్సిపాల్ శైలజ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే పురస్కారాన్ని అందుకున్న పద్మలత

గుంటూరు ఎడ్యుకేషన్: నల్లచెరువులోని మహావీర్ జైన్ మెమోరియల్ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కిలారి శ్రీ పద్మలత సావిత్రీబాయి పూలే జాతీయ ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని అందుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ లలిత్‌కుమార్ జైన్ తెలిపారు. బుధవారం నల్లచెరువులోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ (ఎస్పీఎల్‌టీఏ) ఆధ్వర్యంలో ఇటీవల గుంటూరులో జరిగిన సావిత్రీబాయి పూలే జాతీయ ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా తమ కళాశాల అధ్యాపకురాలిని పురస్కారంతో సత్కరించారని తెలిపారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, ఇంటర్ విభాగ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, సహచర అధ్యాపకులు పద్మలతకు అభినందనలు తెలిపారు.

In The Court of the 1st Additional Senior Civil Judge Guntur

Plaintint: Pasupuleti Venkata Subba Rao S/o Subrahmanyam, Navabharath Nagar, Guntur.

Defendent: Naarisetty Vimala Devi W/o Gopi Chand, Door No. 20-7-800, 1St lane, Mutyala Reddy Nagar, Guntur.

సదరు ప్రతిక ప్రకటన మూలముగా తెలియ పరుచునది. శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు ఈ క్రింది అడ్రసుకు దావా సమనులు మీకు పంపించినను అమలు కాకపోవుట మూలముగా మరియు రిజిష్టారు పోస్టు ద్వార కూడా అమలు జరుగకుండుట వలన కోర్టు వారు సమనులు అమలు నిమిత్తము Substituted Service క్రింద ఉత్తర్వులు మంజూరు చేసియున్నారు. గాన ఈ ప్రతిక ప్రకటన ఇవ్వబడినది. ఈ ప్రకటన చూసి శ్రీ కోర్టువారి యెదుట మీరు ది.10-2-2025 తేదీన హాజరు కాగలరని తెలియపరచబడినది.

To: నారిశెట్టి విమలాదేవి, W/o గోపిచంద్ R/O Door No. 20-7-800, 1St Lane ముత్యాలరెడ్డినగర్, గుంటూరు పట్టణం,గుంటూరు జిల్లా.	From: 1st Additional Senior Civil Judge Court, Guntur.

శ్మశాన వాటిక గోడ విషయంలో వివాదం

- గోడ కూల్చడంతో ఘర్షణ వాతావరణం
- 6 గంటల తర్వాత వచ్చి గోడ నిర్మిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే
- నిరసన విరమించిన ఆందోళన కారులు



రోడ్డుపై బైఠాయించిన మహిళలు



వివాదానికి కారణమైన శ్మశానవాటిక గోడ

పట్నంబజారు: శ్మశాన వాటిక గోడ కూల్చిన ఘటనలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలు.. గుంటూరు తూర్పు నియోజకవర్గం పొన్నూరు రోడ్డులో అంజుమన్ సంస్థకు చెందిన మసీదు ఉంది. వెనుక ముస్లిం మైనార్టీల శ్మశాన వాటిక ఉంది. ఆనందపేట నుంచి శ్మశాన వాటికకు దారి ఉంది. సంగడిగుంట 2వలైనులో ఉన్న శ్మశానవాటిక గోడను కూల్చడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. మృతిచెందిన వారిని అటువైపుగా తీసుకొస్తారనే అనుమానంతో సంగడిగుంట 2వలైను ప్రాంతవాసులు బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి ఆందోళన చేపట్టారు. ఈస్ట్ సబ్‌డివిజన్‌డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సంగడిగుంట ప్రాంతవాసులు గోడ కూల్చేందుకు అనుమతులు ఉన్నాయా..? నివాసాల మధ్య మతదేహాలను ఎలా తీసుకొస్తారంటూ ఆందోళన చేపట్టారు. దీనికి సంబంధించి కార్పొరేషన్ అధికారులు సమాధానం చెప్పకపోవడంతో రాత్రి 8 గంటల వరకు రోడ్డుపై బైఠాయించారు. అప్పటికీ అధికారులు రాకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే వచ్చి సమాధానం చెప్పాలంటూ నినాదాలు చేశారు. అధికారులు, ఎమ్మెల్యే రాకపోవడంతో రాత్రి 8 గంటల తరువాత రోడెక్కారు. కూల్చిన గోడను తక్షణమే నిర్మించాలంటూ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో రాస్తారోకోకు దిగారు. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించి ఇరువర్గాల మధ్య ఎలాంటి గొడవ లేకుండా సర్ది చెప్పారు. ట్రాఫిక్‌ను మళ్లించారు.

ఆలస్యంగా స్పందించిన ఎమ్మెల్యే

సాయంత్రం నుంచి సంగడిగుంటకు చెందిన ప్రజలు ఆందోళన చేస్తూ ఎమ్మెల్యే రావాలంటూ కోరినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ స్పందించలేదు. స్థానిక టీడీపీ నేతలు బుజ్జగింపు ప్రయత్నాలు చేసినా స్థానిక మహిళలు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద వివాదం జరుగుతోందని అధికారులు సమాచారం ఇవ్వడంతో రాత్రి 10 గంటల సమయంలో ఎమ్మెల్యే నసీర్ ఘటనా స్థలానికి వచ్చారు. స్థానికులకు ఇబ్బందిగా ఉంటే తాము గోడ నిర్మిస్తామంటూ చెప్పారు. కూల్చిన గోడను గురువారం సాయంత్రంలోగా నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేశారు. దీంతో గోడ నిర్మించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. గోడ నిర్మిస్తామని అధికారులు, ఎమ్మెల్యే హామీ ఇవ్వడం వివాదం సద్దుమణిగింది.